



# కథామృతం

## పెద్దిభొట్ల సుబ్బరామయ్య



మనకెంతకూ అంతుపట్టని ఈ విశాల జీవితపు కాన్వాసు మీద ఎన్నెన్ని కోటాను కోట్ల స్పష్టాస్పష్ట పాదముద్రలున్నాయో ఎవరికి తెలుసు? ఎన్నింటిని ఎవరైనా గుర్తు పట్టగలరు? ఒక్కొక్క వ్యక్తికి పైకి కనబడని అంతరంగ వేదన ఒక్కో విధంగా ఉంటుంది. తన దేశాన్ని తన జనాన్ని విడిచి వందలాది మైళ్ల దూరం వలస వచ్చి భాషగాని భాష అలవరచుకుని దారుణమైన స్పర్ధతో నిండిన ఈ జీవన సమరంలో ప్రత్యర్థుల క్రౌర్యాన్ని ఎదుర్కొంటూ మరో గత్యంతరం లేని వాడిలా అమిత వేదనా పూరితమైన కఠిన జీవన యాత్ర సాగిస్తున్న ఈ విచిత్ర వ్యక్తి కథ ఏమిటి ? వ్యధ ఏమిటి ? పైకి నిష్ఠూరంగా క్రూరంగా కనిపించే అతని ప్రవర్తనకు పోకలడలకు కారణం ఏమిటి ? అతని భార్య బిడ్డల సంగతి ఏమిటి ? నిలిచిన చోట నిలకడగా నిలువనీయక అతన్ని, అతని కుటుంబాన్ని నిరంతరం తరుముతూ భీకరంగా వెంటాడే బాహ్య శక్తులు.... ప్రతి నిముషం మనసును నిలువనీయక క్షణ క్షణ వేదనకు గురి చేసే అంతరంగిక వేదన... తట్టుకోలేక గిలగిలలాడే ఆ వ్యక్తి దయనీయ వృత్తాంతం ఏమిటి? అక్కడ వదిలివెళ్ళే పాదముద్రలనెవరైనా ఎక్కడైనా గుర్తుపట్టగలరా ? గుర్తు పట్టేందుకు ఎంత మానవతా దృష్టి కావాలి? ప్రతి పదవేదనా మయమై ఒక అద్భుత పాత్ర చుట్టూ అల్లబడిన అతి చక్కని రచన.... అడుగుజాడలు ! నాలుగు దశాబ్దాల నాటి ఈ అసామాన్య రచన 'చినుకు' పాఠకుల కోసం... ఈ నెల.....



**పలు రచయితల**

**కథాసుధలు**

# అడుగుజాడలు

**భమిడిపాటి జగన్నాథం**

ఈ నెల
"కథామృతం"

రోహిణీ కార్తె ప్రవేశించి మూడో రోజు. పొద్దుట నుండి వేడి గాలి మొదలై, తొమ్మిదయే టప్పటికే వడగాలి ఎక్కువై, ఎండనిప్పులు చెరిగేస్తోంది.

ఇంటి దగ్గర పదింటికి బయలుదేరి సాయంత్రం నాలుగింటికి రాజమండ్రి చేరుకున్నాను. స్టేషనుకు వెళ్ళేటప్పటికి నాక్కావలసిన బండి సిద్ధంగా ఉంది. కొవ్వూరు టిక్కెట్టు కొని బండిలో కూర్చున్నాను.

గోదావరి స్టేషనులో జనంతో బండి నిండు గర్భిణిలా బయల్దేరి గోదావరి వంతెన మీద మంద్రంగ, బరువుగ అడుగులు వేస్తోంది. జనం గోదావరిలో రాగి కాసులు విసురుతున్నారు. కిటికీలోంచి తొంగి చూసాను. గోదావరి ఎండి పోయి పెద్ద,పెద్ద ఇసుక మేటలు వేసింది. దూరాన నీళ్ళు ఆకుపచ్చగా కనుపిస్తున్నాయి.

గాలి వీచి చదునుగా,క్రమంలో మెరిసే రేణువులతో ఇసుక తిన్నెపరుచుకుంది - బద్ధకంగా. ఎండ పడి ఇసుక బంగారు పొడిలా మెరుస్తోంది.

ఉన్నట్టుండి నా చూపు నిలిచి పోయింది. ఆ ఇసుక తిన్నెలో అడుగుజాడలు. ఎవరో నాకు తెలియని వ్యక్తుల చిహ్నాలవి. ఆజాడలు నా చూపు నిలిపివేశాయి.

అవ్యక్తమైన వాంఛతో నామనసు నిండి పోయింది. ఆవాంఛ నాకు అనుభవమవదు. కాని నా మనసంతా ఆవరించుకుంది.... ఆ తిన్నెపై దిగి, సువిశాలంగా పరుచుకొన్న ఆ ఇసుకమేటలో ముద్రింపబడిన ఆ పాదాల జాడలు తాకాలనీ, వాటిని వదలకుండా వాటిలో కలిసిపోవాలనే నా వాంఛలోని 'ఆసందర్భం' నాకు తెలుసు. కాని నాలో ఆ కోరిక మధురంగా నిలిచిపోయింది.

మన కోరికలన్నీ తీరవు..... పచ్చటి వరిచేలమీద పడుకొని ఆడుకోవాలనీ, ఎత్తైన పర్వతాల మధ్య గుహల్లో తిరుగాడాలనీ, నీలపు సముద్రపుటంచులు తాకాలనీ - ఈ వాంఛలు తీరనివే. కాని ఆకోరిక మనని వీడదు. మనసంతా పొంగిన పాలలా ఆవరించు కుంటుంది. అందుకోలేక పోయినా, ఊహలను మనసులో నిలిపి జోకొడుతుంది. మానవుడు ఆ మత్తులో హాయిగా నిదురించి, మేల్కొని వాస్తవలోకంలో పడతాడు. బతికి మేల్కొన్న ఘడియల కంటే ఆ మత్తే అతనికి ఉత్సాహాన్నిస్తుంది. అందుకోలేని ప్రకృతి, అర్థం కాని, అందీ అందని జీవితలక్ష్యం - ఇవే అతని మనుగడకు పునాది.

అంచుల్లేని పాలసముద్రంలో, మధుర హాసంతో ఒప్పే రమణితో,శేషపానుపుపై శయనించినట్టు ఆ 'కమనీయమూర్తి'ని చూపించే దృశ్యం - నాకిప్పటికీ, అందుకే అత్యంత మనోహరంగా గోచరిస్తుంది. ఆ 'భావన' గొప్పది. దానిని మానవుడు అందుకుని, అనుభవించ లేకపోవచ్చు. కాని అలాంటి ప్రశాంతమైన, నిర్వికారమైన నిశ్చలమైన అనుభవం కావాలని మనసు కోరుతుంది. లభ్యం కాదని తెలిసినా నిరాశ లేదు, నిస్పృహ లేదు.

కొవ్వూరులో రైలు నిలిచింది.

బస్సుస్టాండు కొచ్చాను. లాస్టు బస్సు అందింది. జనం అప్పటికే కిక్కిరిసి ఉన్నారు. ఉక్క తగ్గలేదు. బస్సు కదిలేసరికి బస్సు 'పాలవెల్లి'లా తయారైంది. లోపల ఊపిరాడ్డం లేదు.

అప్పుడప్పుడు కాస్త గాలి, అదైనా వేడిగా తగుల్తోంది. దూరాన మబ్బులు పడి కొండలు నీలిరంగులో ఆవరింపబడుతున్నాయి. సూర్యుడు కొండ కిందకు దిగిపోతున్నాడు. - కోపంతో ముఖం కందగడ్డలా చేసు కుని, మేఘాల అంచులు రక్తవర్ణంతో మెరుస్తున్నాయి. ఆ కాంతుల్ని అందుకుని వాటి అంచున నిలబడగలిగితే!

ఓ గంటసేపయిన తర్వాత జనం తగ్గారు.

చుట్టూ చీకటి. బస్సు లో రొద. ఇంకా వెచ్చగా వీస్తున్న గాలి, దూరాన పొలాల్లో మిణుగురు పురుగులు భూమి మీద నక్షత్రాల్లా మెరుస్తున్నాయి. కొండలు చీకట్లో కలిసిపోయాయి.

నేను వెళ్ళవలసిన ఊరు జేరడానికి ఇంకా ఓ గంట పడుతుందిట. నా గుండెల్లో రాయి పడింది. ఆ రాత్రప్పుడు ఆ కొత్త ఊళ్లో ఎక్కడకు వెళ్ళను? పొద్దుట నుండీ ప్రయాణంలో, వడగాలితో విసుగెత్తి పోయింది. చివరకు ఈ బస్సు ప్రయాణంలో నాలో ఓర్పు పోయి - చిరాకు, విసుగు చివరి దశకు వచ్చేసాయి.

తొమ్మిదైంది. నేను రావలసిన ఊరు వచ్చిందని చెప్పాడు కండక్టరు. దిగాను, చుట్టూ చీకటి. కొంచెం దూరంలో కిళ్ళీ కొట్టులో పెట్రోమాక్సు లైటు వెలుతురు. పై నించి సామాను అందుకోడానికి కూడా ఎవరూ లేరు. నేనే అందుకున్నాను. చెయ్యి బెణికింది. బస్సు కదిలిపోయింది.

ఈ ప్రయాణంతో వళ్ళంతా నలిగి పోయింది. మనసు ఆలోచించడం అలవాటు లేనట్టుగా మొద్దుబారి పోయింది. ఆ చీకట్లో, కొత్త ప్రదేశంలో కొద్దిక్షణాలు నిలుచున్నాను. కర్తవ్యం గుర్తుకొచ్చింది.

లైటు దగ్గరకు వెళ్ళాను. కిళ్ళీకొట్టతను కొత్తముఖం, నా వాలకం చూసి కాబోలు 'ఏమిటన్నట్టు?' చూసాడు.

"నేనీ ఊరికి కొత్త. ఇప్పుడే బస్సుదిగాను. ఇక్కడికి ఉద్యోగం మీద వచ్చాను. ఈ రాత్రి ఏదైనా హోటల్లో గది దొరుకుతుందా?" అన్నాను.

"అబ్బే ! ఇది చిన్న పల్లెటూరండీ. గదులు

దొరకవు. మీ ఆఫీసు కూడా మూసేస్తారే ?" అని కాసేపాలోచించాడు.

"ఇక్కడో అయ్యరు ఓటలుంది. అక్కడ భోంచేయండి. పడుకకు నే చూస్తాన్లెండి." అని చప్పట్లు కొట్టి "ఒరే, సుబ్బా!" అని పిల్చాడు.

"ఈరి సామాన్లు అయ్యరు ఓటల్లోకి తీసికెల్లి ఈరికి భోజనం పెట్టించు. కాంత పడుకోటానికి చోటిమ్మను.....'బుల్లబ్బాయి' పంపాడని చెప్పు"

ఆ మనిషి నా సామాను తీసుకుని ముందు నడుస్తున్నాడు. కళ్ళు కనిపించనంత చీకటిగా ఉంది. ఓ ఫర్లాంగు నడిచాం.

"జాగరతగా నడండి బాబూ !..... ఇక్కడ కాంత లోతు" అన్నాడు సుబ్బన్న ముందు కదుగేస్తూ.

''అలాగే'' అంటూ జారిపడబోయి, తప్పించుకు నడిచాను.

"అయ్యరు గోరూ...."

చీకటికి కళ్ళు అలవాటు పడ్డాక ఆ ఇల్లు గడ్డితో నేసిన ఇల్లని తెలిసింది. ఒక పక్క వాటాలో లాంతరు తీగకు వేళ్లాడుతోంది...... పక్కనే పెద్ద త్రాసు – కిరాణా కొట్టని చెపుతూ. ఆ పక్కనుండి ఓ ఆడమనిషి వచ్చి "ఎవరూ?" అంది.

"ఈ అయ్యగోరికి భోజనం పెట్టి ఈ రాతిరి కిక్కడ పడుకోడానికి చోటిమ్మని కిల్లీకొట్టు 'బుల్లబ్బాయి' గోరు పంపారండి. అయ్యరు గోరుతో సెప్పండి."

ఆవిడ పక్కవాటాలోకి వెళ్లింది. ఎవరో మూలుగుతున్నారు. ఆ మూలుగుతున్నావిడతో మొదట వచ్చినావిడ ఎవరో భోజనానికి వచ్చారని చెప్తోంది.

"మా లక్ష్మిని కాస్త లేపమ్మా – ఆరికి విస్తరేసి వడ్డించమను" మాట యాసగా ఉంది.

పక్కింటి నుండి వచ్చినావిడ 'లక్ష్మి' అని ఓ నిద్దురపోతూన్న పిల్లని లేపి, "భోజనం వడ్డించ మంటున్నారు మీ అమ్మ" అంది.

ఈ పిల్ల బద్ధకంగా, కళ్ళు నులుము కుంటూ లేచింది. నా సామాను వీధి అరుగు మీద పెట్టి సుబ్బన్న వెళ్లిపోయాడు.

ఆ పిల్లకి నిద్రలోంచి లేవడానికిష్టంగా లేనట్టుంది. విసుగ్గా వీధి గదిలో విస్తరి వేసింది. ఇంట్లోంచి మూలుగు కర్కశంగా,బాధగా ఆ నిశ్శబ్దంలో అసహ్యంగా ఉంది.

చల్లారిపోయిన అన్నం, వాసన వేసే పచ్చడీ, గొంతులో దిగే ఆ అడ్డాకులోని పుల్లలూ – నాకు వెగటు వచ్చింది.

పక్కింటావిడ అడుగుతోంది. "ఏవండీ పిన్నిగారూ ! కాలినొప్పి తగ్గలేదా ?"

"ఇవాళింకా మోపుజేసి మరీ బాధగా ఉందమ్మా" ఆ మూలుగుతున్నావిడ చెప్తోంది.

నాకు వడ్డించే పిల్ల మజ్జిగ పోసి వెళ్ళి పడుకొంది.

"ఆరికి పెరుగు పోసావా? వంటింట్లో, గూట్లో ఉంది" అని యాసతో, ఆ మూలుగు తున్నావిడ లోపలి నుంచి కేకేసింది.

ఆ పిల్ల విసుక్కుంటూ, గొణుగుతూ లేచింది.

"అక్కర్లేదు" అని లేచి చేయి కడుక్కున్నాను.

పైన పక్క వేసుకున్నాను. నిద్ర పట్టడం లేదు.ఆ నిశ్శబ్దంలో లోపలి నుండి మూలుగు వికృతంగా ధ్వనిస్తోంది. ఆ మూలుగు, దోమలు,గాలి బిగిసిపోయి ఉక్క.... ఆరాత్రి నాకు నరకం కనిపించింది.

మర్రోజు ఆఫీసుకు వెళ్ళి జాయినయాను. ఆరోజేఓ వాటా అద్దెకు తీసుకున్నాను. ఊరు చాలా చిన్నది. ఆ హోటల్లోనే భోజనం చేస్తున్నాను. ఆ తొమ్మిదేళ్ళ పిల్ల 'లక్ష్మి' నాకు రోజూ వడ్డిస్తోంది. ఆ మూలుగుతున్నావిడ అయ్యరు భార్యనీ, నేను వచ్చే క్రితం రోజునే అన్నం వారుస్తూంటే, గంజి కాలిమీద పడి బొబ్బలెక్కి బాధపడుతోందని తెలిసింది.నాలుగు రోజులు పోయాక, ఓ రాత్రి భోజనం చేసి వీధి వసారాలో స్టూలు మీద కూచుని సిగిరెట్టు కాల్చుకుంటున్నాను.

నాముందు పిలకతో, ఎర్రని కళ్ళతో ఎత్తు పళ్లతో మురికి ఓడుతూన్న పంచతో నిలుచున్న అతను నాకేసి చూస్తూ "కొత్తగా భోజనానికి చేరారా? ఎడ్వాన్సు ఇరవై ఇవ్వండి" అన్నాడు.

అతనే అయ్యరని తెలిసింది. రూపాయ లిచ్చాను.

''ఎక్కడ పనిచేస్తున్నారు?'' గొంతు కర్కశంగా ఉంది.

నే చెప్పేలోగానే ఎటో చూస్తూ ఆలోచనలో పడిపోయాడు.

"మంచి నీళ్ళు కావాలి" అన్నాను.

" నీళ్ళియ్యి" అంటూ ఇంట్లోకి ఉరిమాడు అయ్యరు.

నాకు రోజూ వడ్డించే పిల్ల నీళ్ళు తీసు కొస్తుంటే, కొద్దిగా అతని పంచమీద వలికాయి.

"బుద్ధి లేదూ? ఏం అంత పరాకు?" అంటూ అయ్యరు ఛట్టున ఆ పిల్లని లెంప మీద కొట్టాడు. ఆ పిల్ల చేతిలోని గ్లాసు దూరంగా పడింది. ఆ లేత కళ్ళల్లో గిర్రున నీళ్ళు నిలిచాయి.

ఎరుపెక్కిన ఆ లేత బుగ్గ మీద తట్లు తేలాయి.

ఆ యజమాని రూపం, అతని ప్రవర్తన, ఆ పరిసరాలు, ఇంట్లోంచి ఆ మూలుగు.... ఇవన్నీ ఆ ఇల్లన్నా, ఆ ఇంట్లో వ్యక్తులన్నా నాకు వెగటు కలిగించాయి.

ఆ హోటల్లోనే భోం చేస్తున్నాను. అయ్యరు భార్య కొంచెం తిరగ గలుగుతోంది. నా భోజనం వాలకం, ఏదీ ప్రత్యేకంగా అడగక పోవటం గమనించిందనుకుంటాను – లక్ష్మితో చెప్పి రోజూ పెరుగు పోయించేది. ఆ పిల్ల లక్ష్మి దిగులుగా తిరుగుతూ ఇంట్లో పనంతా చేసేది. ఆ విషయం కొట్టొచ్చినట్టు కనపడేది. అయ్యరు ఆ పిల్లని చీటికీ మాటికీ అకారణంగా కొట్టేవాడు. ఏదో కారణం కల్పించి ఆ పిల్లని పిలిచి బాధించేవాడు.

.....ఆ రోజు రాత్రి అయ్యరు భార్య వడ్డిస్తోంది. అయ్యరు ఎందుకో గాని ధుమ ధుమలాడుతూ ఇంట్లో కొచ్చాడు. లక్ష్మి ఆరోజు కూనిరాగం తీస్తూ గుడ్డ పీలికలతో తాటాకు బొమ్మకి అలంకరణం చేస్తోంది. అయ్యరు ధూకుడుగా నడుస్తూ వచ్చి ఆ పిల్ల తాటాకు బొమ్మని తొక్కేసాడు. బొమ్మ ఆకారం పోయి తప్పడగా అయిపోయింది. ఆ పిల్ల 'నా బొమ్మ' అని దీనంగా చూస్తోంది.... బిక్క మొహంతో. అంతే ! – అయ్యరు తట్లు తేలేట్లు ఆ పిల్లని కొడుతున్నాడు. భోం చేస్తూన్న నాకు అమితమైన

బాధ కలిగింది. కూచోలేకపోయాను.

ఛట్టున లేచి వెళ్ళి ఇంకొక్క దెబ్బ పడిందంటే ఊరుకోను అన్నాను. నా కంఠం నాకే కఠినంగా ధ్వనించింది. ఏమనుకున్నాడో అయ్యరు సణుగుతూ వీధిలోకి పోయాడు.

పక్క తలుపు దగ్గర వెక్కివెక్కి ఏడుస్తూన్న ధ్వని వేపు నా దృష్టి మళ్ళింది. తెల్ల చీరతో, ఓ పాతికేళ్ళ పడుచు గొంతులో కొంగు కుక్కుకుంటూ ఏడుపు దిగ మింగుకుంటోంది.

ఆ ఇంటిలో ఆమెనింతవరకూ నేను చూడలేదు. ఆమె నుదురు విశాలంగా, బొట్టు లేక పోవడం చేత కాబోలు – మరీ విశాలంగా ఉంది. ఆ పెద్ద కళ్ళు కన్నీళ్ళతో నిండాయి. ఆమె నన్ను చూసి బెదిరినట్టుగా పక్కకి తప్పుకుంది.

"ఆయనదంతే పిచ్చి కోపం బాబూ ! భోజనం మధ్యలో లేచారు. కూచోండి – పెరుగు పోస్తాను" అంది అయ్యరు భార్య.

నాకిక తినాలనిపించక 'రానని' చెప్పాను.

నా మనసంతా కలత బారిపోయింది.

"మీరు భోజనం పూర్తి చేయకుండానే మధ్యలోనే లేచారు. ఇక్కడికి హోటలు మార్చాక భోజనం కూడా సరిగా పెట్టలేకపోతున్నాము" అంటూ అయ్యరు భార్య నొచ్చుకుంది.

"మునుపు ఈ ఊళ్ళోనే ఇంటో చోట ఉండేదా మీ హోటలు?"

ఆమె కాసేపు ఏం మాట్లాడలేదు. తర్వాత, "మా రాత బావుండలేదు బాబూ ! అంతా చక్కగా జరిగిపోయేది. మా ఇల్లు కాలిపోయి ఇలాటి అవస్థ పడుతున్నాం" అంది.

"ఇల్లెందుకు కాలిపోయింది?"

ఆమె 'ఖర్మ' అన్నట్టుగా నొసటమీద చేత్తో రాసుకుంది.

"ఈ ఊరొచ్చి ఐదేళ్ళయింది బాబూ! ఎక్కడా కలిసిరాంది ఈ ఊళ్ళో కాస్త నిలదొక్కుకున్నాం. ఏదో కాలం గడిచిపోతోంది. సొంత ఇల్లు కూడా – గడ్డితో వేసినదే అనుకోండి– కట్టుకున్నాం. ఆరునెలల క్రితం భోజన హోటలుతో పాటు కాఫీ హోటలు కూడా పెట్టేరాయన. ఈ ఊళ్ళోఅప్పటికే రెండు కాఫీ హోటళ్ళున్నాయి. వాళ్ళకి ఇష్టం లేదు ఈ పోటీ. కాఫీ హోటలు మూసేయమని కొంతమంది చేత చెప్పించేరు. ఈయన వినలేదు. ఈయనదంతతా పట్టుదల. లాభాలుకూడా వచ్చేయి.

"నెల్లాళ్ళ క్రితం ఓ రోజు రాత్రి ఈయనా, వాళ్ళూ మాటా మాటా అనుకున్నారుట. అంతే ! ఆ రోజు అర్ధరాత్రి ఇల్లు కాలిపోతూంటే మెలుకువ వచ్చి చూసుకుంటే అంతా పూర్తి అయిపోయింది. ప్రాణాలతో బయటపడ్డాం. సంపాదించి దాచుకున్న కొద్ది సొమ్మూ కాలిపోయింది. చెమటోడ్చి కట్టుకున్న ఇల్లు కాలిపోయింది. సామాను మసి ఐపోయింది. వీధిలో నిలబడ్డాం.

"ఊరికే అంటుకుంటుందో, ఎవరైనా అంటించారో – నిజం ఆ భగవంతుడికే తెలియాలి బాబూ !"

ఆమె కంఠం రుద్ధమైంది.

ఆమె దుఃఖం నాకు అర్ధమైంది. వాళ్ళ దేశం విడిచి, ఎంతో దూరం పొట్ట కోసం వచ్చి ఎక్కడా కలిసి రాక, చివరికి ఊళ్లో కాస్త పచ్చగా ఉంటుంటే – మళ్ళా యధాస్థితికి దిగజారడం ఎంత బాధో ఊహించుకుంటేనే గ్రాహ్యమవుతుంది.

.....రోజూ రాత్రి భోజనం చేసి నేను వీధి వసారాలో స్టూలు మీద కూచుని సిగరెట్టు కాల్చుకుంటూండగా, అప్పుడప్పుడు అయ్యరు భార్య తమ గాథ చెప్పేది.

వాళ్ళది తుళు భాషట. కేరళ రాష్ట్రంలో ఉండేవారట. మలయాళం బాగా వచ్చుట. ఇలా ఎన్నో సంగతులు చెప్పేది. ఎందుకో ఆమె ఒక్కో సమయంలో కొన్ని విషయాలు నాతో చాలా సన్నిహితంగా చెప్తూండేది. ఆపుకోలేని బాధ ఏదో తనలో ఇమడి ఉన్నట్లుగా మాట్లాడేది.

.... ఆరోజు రాత్రి కేంప్‌కు వెళ్ళి రాత్రి తొమ్మిదిన్నరకు భోజనానికి హోటలుకుబయలు దేరాను. అమావాస్య ముందు చీకటి, పక్క దుకాణం తాలూకు కుటుంబం మూడు రోజులై పెళ్ళికి వెళ్ళారు. అంచేత ఆ వాటా నుండి దీపం వెలుగు లేక అయ్యరు హోటలు ఆ చీకటిలో కలిసిపోయి ఆకృతి లేకుండా ఉంది. తడుముకుంటూ మెట్లెక్కుతున్నాను.

అయ్యరు కంఠం ఆ నిశబ్దంలో వికృతంగా తారాస్థాయిలో పలుకుతోంది. గదిలో అడుగు పెట్టబోయి లోపలి దృశ్యం చూసి ఆగిపోయి వీధి వరండాలోనే నిలుచుండిపోయాను.

అయ్యరు వాళ్ళ భాషలో ఏదో అరుస్తున్నాడు. నేల మీద దెబ్బలతో శోషిల్లి 'లక్ష్మి' మూలుగుతోంది. పెదిమ పక్కన రక్తం చార మెరుస్తోంది. నేనా రోజునచూసిన ఆ పాతికేళ్ళ పడుచు పరి దీనవదనంతో, కట్టెలా, ఎదురుగా వంచినతలతో నిల్చుంది. ఆమె నుద్దేశించి అయ్యరేదో అంటున్నాడు ఆమె ముఖం చేతుల్లో కప్పుకొని ఏడుస్తోంది.

ఇంతలో ఉన్నట్టుండి అయ్యరు నేలమీద సొమ్మసిల్లి పడిపోయిన లక్ష్మిని చేతిలోని కర్రతో బలంగా కొట్టడం మొదలుపెట్టాడు. ఈ సారి ఆ పడుచు క్షణంలో పరుగున వచ్చిఆ పిల్లని వాటేసు కుంది. లక్ష్మిని కొడుతూన్న దెబ్బలు మాని, ఆమెను ఒక్క ఊపులో పైకి లాగి గోడకు తోసేసి, కోపంగా ఏదో అని వీధిలో ఉన్న నన్ను గమనించకుండానే నన్ను తోసుకుంటూ బైటకు పోయాడు.

ఓ మూల పిల్లిలా భయంలో ముడుచుకు పోయిన అయ్యరు భార్య జీవచ్ఛంలా ఐపోయింది. ఆమె వదనంలో దుఃఖపు ఛాయలు, ఎనలేని వ్యధ కొట్టొచ్చినట్టు ప్రతిఫలిస్తున్నాయి.

ఇంతలో ఆ పడుచు నన్ను చూసింది. బెదిరిన, దెబ్బ తిన్న పక్షిలా రివ్వున లేచి లక్ష్మిని అక్కున జేర్చుకొని, పిచ్చిగా లోపలికి వడిగా పోయింది.

అప్పుడు అయ్యరు భార్య నన్ను చూసింది. తెల్లబోయినట్టుగా కాసేపు ఉండిపోయింది. రెండు నిమిషాల్లో లేచి, ముఖంకడుక్కొని నిశ్శబ్దంగా పీట వేసి విస్తరి వేసింది.

"నేనీ పూటేం తినను" అంటూ వీధి వసారాలో స్టూలు మీద కూర్చున్నాను.

ఆమె ఓ గ్లాసు మజ్జిగ తీసుకొచ్చింది. తాగాను. సిగరెట్టు కాల్చుకుంటున్నాను.

సిగరెట్టు ఐపోయింది. లేచాను.

"వెళ్తున్నారా"?..........

ఆ పిలుపులోని వేదన నన్ను నిలిపి వేసింది. ఆమె ముఖం సరిగా కనబడక

పోయినా ఆమె స్వరంలోని దీనత్వం నన్ను కదిలించివేసింది. ఆపుకోలేని, తనలో ఇముడ్చుకోలేని వ్యధతో ఆమె అల్లాడిపోతోంది.

"నాకు కాస్త విషం సంపాదించి ఇవ్వండి. నాకింకేమీ వద్దు. నేనీ బాధ భరించలేను". అంది ఆమె నాకేసి జీవం లేనట్టు చూస్తూ.

"మీకెంతమంది పిల్లలు?" అన్నాను నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ.

ఆమె కాసేపాలోచించి "ముగ్గురు - ఇద్దరమ్మాయిలు, ఓ అబ్బాయి" అంది.

"అయ్యరుగారికి కోపమెక్కువ. మీరు ఎలాగోఅలవాటు పడాలి. ఆయన కోపానికీ, మూర్ఖత్వానికీ మీరేతల్లడిల్లిపోతే - పిల్లలు బెంగ పడిపోరా ? మీ పెద్దమ్మాయి ఎంత బాధపడు తోందో గమనించారు గదా ! మీరు కలగజేసుకోవడంతో మీ పెద్దమ్మాయి చెల్లెలు లక్ష్మిని ఆదు కోవలసి వస్తోంది. ఇలాంటి సమయాల్లోనే మీరు ధైర్యంగాఉండాలి" అన్నాను.

ఆమె మాట్లాడలేదు. స్థాణువులా ఉండిపోయింది.

"పిల్లల్ని ఏదో విధంగా మీరే పైకి తీసుకురావాలి. చిన్న పిల్ల పెళ్ళి, అబ్బాయి చదువు ముఖ్యం గదా! అందులో పెద్దపిల్లని దేవుడే అన్యాయం చేశాడు. ఆమె మీద పిల్లల భారంవేసి మీ దారి మీరు చూసుకోవడం ధర్మం కాదు. పోనీ ఆమెకు మళ్ళావివాహం చేయలేకపోయారా? మీ దేశంలోఆ ఆచారంలో మార్పు వచ్చి, మళ్ళా వివాహాలు జరగడంలేదా?" అన్నాను విషయం మార్చాలని.

ఆమె నోట మాట లేదు.

చివరికి నేనే, "ఎన్నాళ్ళయింది మీ పెద్ద అమ్మాయికి వైధవ్యం వచ్చి" అన్నాను.

అంతే ! చట్టున ఆ నిశబ్దంలో అదిరిపోయేటట్టు ఆమె వెర్రిగా అరిచింది. అది కేకో, బాధో, ఆక్రోశమో, వేదనో నాకు తెలియదు గానీ - నా నిలువెల్లా కంపించిపోయింది.

ఉన్నట్టుండి ఆమె చేతులు 'కాదు - కాదు' అన్నట్టుగా ఊపుతూ, గూడు కట్టి, ఘనీభవించిన శోకాన్ని ఇక ఆపుకోలేక ఆ చీకటి రాత్రి వెర్రిగా, వికృతంగా, భయానకంగా, ఏడ్వనారంభించింది.

ఆమెను ఓదార్చడం సాధ్యం కాని పనని నాకు పది నిముషాల్లో తేలిపోయింది.

ఒక అరగంటకు ఆమె కన్నీరు కట్టింది.

"భర్త పోవడం ఆమె తప్పుకాదు. ఆమెకు నిరంతర వైధవ్యం కల్పించింది...." అంటూ సర్దబోయాను.

ఆమె గొంతు పెగల్చుకొని, ఎలుగు రాపడిన గొంతుతో అంది - "అంత మాటన వద్దు, మిమ్మల్ని వేడుకుంటున్నాను. మా అమ్మాయి విధవ కాదు. నేనా మాట భరించలేను. ఆ మాట అని నన్ను బాధించవద్దు."

ఈ సారి నాకు ఆశ్చర్యమైంది. ఆమె తెలివిలో మాట్లాడుతోందా అన్న అనుమానం కలిగింది.

మొహాన బొట్టు, చేతుల్కి గాజులు లేవు - ఆమె వైధవ్యం అనుభవిస్తోందనడం నా తప్పా?

నేనేమీ అనదలుచుకోలేదు.

అయ్యరు భార్య లేచి నాకు కొంచెం దగ్గరగా వచ్చి కూర్చుంది.

"నేనిక ఈ రంపపు కోత నాలోనే పెట్టుకుని భరించలేను. ఎన్నాళ్ళనుండో నన్ను దహించివేస్తున్న ఈ విషయం ఎవరితోనైనా చెప్పుకుంటే గాని నాకిక ఉపశమనం లేదు."

ఆ రాత్రి చుక్కలు ఆకాశాన మినుకు మినుకుమంటూండగా, ఆ నిశబ్ద వాతావరణంలో ఆమె జీవితగాథ నాకు చెప్పింది. ఆ గాథలో ఇమిడి ఉన్న కఠోర సత్యం నన్ను దిగ్భ్రాంతిలో ముంచింది. ఆమె అర్ధోక్తిలో ఏడుస్తూ చెప్పింది. ఆ మాటలు గుదిగుచ్చితే,

**ఆమె చెప్పిన గాథ :**

మాది కేరళదేశంలో చిన్న పల్లెటూరు. మాకు పెద్దలు సంపాదించింది ఓ ఐదెకరాలు ఉంది. ఆయన వ్యవసాయం చేయించేవారు. మాకు ఏ విధమైన లోటూ లేదు. చుట్టూ కొబ్బరి, పోక మొక్కలతో కనుచూపుమేర పచ్చగా, కనులపండువుగా ఉండేది. మా ప్రథమ సంతానాన్ని ఎంతో అభిమానంతో పెంచి పెద్ద జేశాము. ఆమె బుద్ధిలో, చదువులో చురుకైనది. ఆమె స్కూలు ఫైనలు చదువు తూండగా మా రెండోవాడు పుట్టాడు.

మొదట నుండీ ఆయనకు కుటుంబ గౌరవం మీది గురి ఎక్కువ, చచ్చి స్వర్గాన ఉన్న వాళ్ల తాతగారిని ఏదోనీచంగా అన్నాడని మా పక్కింటి ఆయన్ని కొట్టి, కోర్టులదాకా వెళ్ళారు. పట్టుదల, కుటుంబ గౌరవం కోసం వల్లమాలిన తాపత్రయం తప్ప ఆయనలో చెప్పుకో దగ్గంత చెడు ఏమీ లేదు.

మా పెద్ద పిల్ల అల్లారు ముద్దుగా పెరిగింది. ఆయనే దాన్ని పెంచారు. అదంటే ఆయనకు పంచప్రాణాలు. పిల్లనిడాక్టరు చదివిద్దామనిఆయన ఊహ. కుటుంబగౌరవం మీద ఎంత గురో, ఆ పిల్లమీద అంత అపేక్ష ఆయనకు. ఈ రెండే ఆయన జీవితాన్ని నడిపించేవి. మా పిల్ల చిలకలా పలుకుతూ, పెరిగి,పెద్దదై చక్కగా చదువుకునేది. అలాటి పచ్చని సంసారంలో ఉన్నట్టుండి పిడుగు పడింది. ఆయనకు మతిపోయి, మానవత్వం మరిచిపోయారు.

మా పిల్ల కాలేజీలో చేరిన రెండవ సంవత్సరంలో మాఇంట్లో గొడవలు ప్రారంభం.

అన్నీ నే సరిగాచెప్పలేను.

మా పిల్లకి 'మూడో మాసం' జరుగు తూండగా నాకంతకు ముందే తట్టిన అను మానం నిజమని తేలింది. ఆయనకు తెలిస్తే దాని కంఠానికి ఉరి పోస్తారని నాకు తెలుసు. ఇంకో మాసం గడిచింది. దానికోరోజు వంట్లో నలతగా ఉంటే, నాతో చెప్పకుండా ఆయన ఎంతో ఆదుర్దాతో డాక్టరును తీసుకొచ్చారు డాక్టరు పరీక్ష చేసి వెళ్ళిపోతూ అసలు సంగతి ఆయన చెవిన వేసి పోయాడు.

'ఆ సంగతి తెలిసిన రోజున ఆయన పడిన వేదన, దాన్ని చూసిన చూపు నే మరువలేను.

ఆయన ఎన్ని విధాల అడిగినా, ఎన్ని చేసినా అది 'ఎవరో' చెప్పలేదు. సిగ్గుతో కుంగిపోయింది. తల్లినైన నాతో కూడా అది మనసు విప్పలేదు.

ఆయనకు పిచ్చి కోపం బయల్దేరి, పెరిగి పోయింది. రోజులు గడిచిన కొద్దీ, అందరికీ ఈ సంగతి తెలిసిపోతుందని ఆయన ఆదుర్దా, కుటుంబగౌరవం మంట కలిసిపోయిందని

ఆయన ఆవేదన. ఏమీ చేయలేని ఆ పరిస్థితులలో నా బాధ, చివరకు నాటు వైద్యం చేసి 'అది' తప్పిద్దామని ఆయన ఆలోచించారు. ఆ సమయంలో అలా చేస్తే తల్లి ప్రాణానికే ముప్పనినేను అహర్నిశలూ దాన్ని కాపాడి అలా చేయనీయలేదు. ఆ రోజుల్లో ఆయన పిచ్చెత్తినట్టు తిరిగేవారు.

ఓ రోజున జేబులో రూపాయనోట్ల కట్టలతో ఇంటికి వచ్చారు. ఉన్న ఐదెకరాల పొలం అమ్మేసారట. ఆ ఊళ్ళో ఉంటే తనింక తలెత్తి తిరగలేరుట. అది తెలియక అమాయకత్వంలో చేసిన తప్పుకు స్వదేశం విడిచి, ఎక్కడో దూరంగా కొత్త భాష, కొత్త జనం మధ్య కలిసిపోయి ఈ మచ్చ దాచుకోవాలని ఆయన ఊహ. ఎక్కడికో తెలీకుండా బలవంతాన మమ్మల్ని ప్రయాణం చేయించి 'నెల్లూరు' తీసుకొచ్చారు.

మా పెద్దమ్మాయికి అక్కడే ఆడపిల్ల పుట్టింది.

ఆ రోజుల్లో ఆయన చేసి పనిలోని క్రౌర్యం నాకీనాటికీ గుర్తుంది.

పిల్ల పుట్టిన పదమూడవరోజున దాని బొట్టు చెరిపించేసారు. చేతి గాజులు బద్దలు కొట్టి, తెల్ల చీర దానిచేత కట్టించారు.

ఆయన ఘోరమైన ఊహ నాకు కొంత వరకూ అర్ధమైంది. ఆ పని ఆపబోతే పుట్టిన పిల్లని పీక పిసికి చంపేస్తానన్నారు. దాంతో ఊరుకోవలసి వచ్చింది.

వయసులో ఉన్న పిల్లకి పెళ్ళెందుకు చేయలేదన్న ప్రశ్న ఎక్కడున్నా వస్తుంది. ఆ అనుమానం ఎవరికీ కలగకుండా దాని జీవితం శాశ్వతంగా పాడు చేద్దామని ఆయన సంకల్ప మనిపించింది. అలా చేస్తే అది చేసిన తప్పుకు తగిన శిక్ష అని ఆయన ఉద్దేశం కాబోలు.

ఆ పుట్టిన పిల్ల 'లక్ష్మి'. లక్ష్మిని మాకు పుట్టిన పిల్లగానే పెంచాలనీ, పెద్దమ్మాయి శాశ్వత వైధవ్యం నటిస్తూ తనకి పుట్టిన పిల్ల వేపు చూడనైనా చూడకూడదని – ఇవీ ఆయన ఆంక్షలు. ఆ ఆంక్షలు ఆయన అక్షరాలా అమలు జరిపారు.

లక్ష్మికి నెల నిండుతూండగా ఊరు మార్చి ఇంకో ఊరికి తీసుకొచ్చారు.

లక్ష్మిని నా పిల్లగా పెంచాను. ఓ పక్క పక్క గదిలో అసలు తల్లికి పాలు చేపుతూండగా, ఆయన ఆంక్షకు లోబడి, ఆ చిన్న కూనని పోత పాలతో నేనే పెంచాను. లక్ష్మికి తల్లిని అక్కగా జేసాం. కాని ఆ మాతృహృదయంలో పొంగుతూన్న ప్రేమని ఆపగలమా?

తన దేశం విడిచి, తన ఆస్తి అమ్ముకుని, పరాయి దేశంలో కడుపు కోసం అన్నం అమ్ముకునే స్థితికి ఆ పిల్ల చేసిన ఆ నేరమే కారణమని ఆయన విశ్వాసం. దాంతోనే కక్ష సాధించారు – సాధిస్తున్నారు.

ఊరు నుండి ఊరు మార్పించేవారు. ఏ పనీ చేసేవారు కాదు. ఉన్న డబ్బు మూడేళ్ళల్లో ఐపోవచ్చింది. ఊరు మార్చి హోటలు పెట్టుకున్నాం. కాని ఎన్ని చోట్ల హోటలు పెట్టినా కలిసిరాలేదు. ఈ ఊళ్ళో కాస్త పచ్చగా ఉన్నాం. కాని ప్రజలు మమ్మల్ని చూడలేకపోయారు.

భగవంతుడు, కూతురు, ప్రజలూ – అందరూ కూడా తనకి అన్యాయం చేసారనే ఆయన కక్ష కట్టారు. అదికాస్తా లక్ష్మి మీదకు తిరిగింది. దాన్ని కాల్చుకు తినేవారు. కొట్టి బాధించేవారు.

ఇక ఇవాళ జరిగిన సంగతి : అక్కయ్యా నీకు బొట్టు బాగుంటుందని అది వద్దంటూన్నా వినకుండా లక్ష్మి దాని మొహాన కుంకుమ బొట్టు దిద్దుతోంది. బొట్టు దిద్దుతూండగా ఆయన వచ్చారు. ఆయన కోపానికి అవధులు లేక పోయాయి. ఆ బొట్టు చెరిపి, పెద్దమ్మాయిని నానా మాటలూ అని, లక్ష్మిని చచ్చేట్టు కొట్టారు.

మానవుడు విధించిన శిక్ష – అందులోనూ నిర్దయతో కన్న తండ్రి విధించిన ఆ శిక్ష – భరిస్తూ అది శాశ్వత వైధవ్యం నటిస్తూ తన పిల్లని చూసుకుని, పాలిచ్చి ఆడించుకొని, పెంచి పెద్ద చేసే అవకాశం లేకపోతే– ఆతల్లి మనసు ఎంత విలపిస్తుంది?

అంతా చూస్తున్న నా మనసెంత కాలం ఈ బాధ భరిస్తుంది?

ఆమె నిట్టూరుస్తూ అడిగింది.

'ఇంత ఘోరమా?"అన్నట్టుగా దూరంగా కుక్క ఎలుగెత్తి పెడుతూన్న రోదన.

ఈ కఠోర దుఃఖ గాథ తనలోఇముడ్చుకోలేనన్నట్టు ఆకసం మబ్బుల్తో మూసుకుపోతోంది. ఒక స్త్రీ తెలియక చేసిన తప్పిదానికి, పరువు కోసం తండ్రి విధించిన ఆ జన్మాంత శిక్షని విని కాబోలు నక్షత్రాలు వెల వెల బోయాయి.

ఈ విషాద సత్యం నా మీద ఎంత తీవ్రంగా పని చేసిందో నే చెప్పలేను.

ఆ రాత్రి ఇంటికి వెళ్ళి పడుకున్నా నిద్రలేదు.

పాపం ! కుటుంబ గౌరవ ప్రతిష్ఠల కోసం తప్పు చేసిన ముద్దుల కూతురిని క్షమించలేక, సొంత ఊరు, పొలం తెలనాడుకుని, ఎన్నో వేల మైళ్ళ దూరం ప్రయాణించి సత్యాన్ని మార్చి జీవిస్తూన్న అయ్యరు !

మోసుకుంటే తెలియని వయసులో మోసగింపబడి, తండ్రి చండశాసనానికి బద్దురాలై, జీవన నందనవనాన్ని శాశ్వతంగా ముళ్ళకంపగా మార్చుకుని బతుకుతూన్న ఆ పడుచు !!

కూతురి వ్యథ సహించలేని ఆ తల్లి !!!

దుఃఖ భాజనమైన కుటుంబం.

దుఃఖ చిహ్నంగా లక్ష్మి.

పిలకతో, జిడ్డు ఓడుతూన్న ముఖంలో కోపం తప్ప మరేమి లేని ఆ అయ్యరు మనోవల్మీకంలో ఇంత బాధ దాగి బుసకొడుతూందని ఎవరికి తెలుసు ?

మొదటిసారిగా అయ్యరు మీద జాలి కలిగింది.

★ ★ ★ ★ ★

పొద్దుటే పోస్టుమాన్ లేపాడు. టెలిగ్రాము అందించాడు. ఆత్రుతతో తీసుకుని చూసాను. 'మావగారికి బావుండలేదు. రమ్మ'ని ఉంది. శలవు పడేసి బయలుదేరి వెళ్ళాను. నేను వెళ్ళిన నాలుగు రోజులకు ఆయనకు బాగా కులాసాగా ఉంది. వచ్చేటప్పుడు భార్యాపిల్లల్నీ తీసు కొచ్చాను. మంచి రోజూ అదీ చూసుకుని బయలు దేరేటప్పటికి పదిహేను రోజులు పట్టింది. మళ్ళా నా ఉద్యోగపుటూరు జేరే టప్పటికి.

ఆ రోజు ఇంట్లో భోజనం చేస్తూంటే అయ్యరు హోటలు జ్ఞప్తికి వచ్చింది. మొదట్లో ఆ భోజనం, ఆ ఇల్లు. ఆ వ్యక్తులంటేనే అసహ్యం. ఆ కుటుంబంలో దాగిఉన్న

రహస్యం, ఆ వ్యక్తుల హృదయాల్ని కలచివేస్తూన్న వ్యధ అర్థమయ్యాక ఆ కుటుంబం మీద నాకు కలిగిన సానుభూతి - అన్నీ ఆలోచనల్లో కలిసిపోతున్నాయి.

రాత్రి భోజనం చేసి అయ్యరు హోటలు కెళ్ళాను. పక్కవాటాకింకా తాళం వేసిఉంది. వీధి వసారాలో ఓ మూలగా తుండుగుడ్డ నెత్తిన వేసుకుని, నెత్తిన చేతులు పెట్టుకుని గొంతు క్కూర్చున్నాడు అయ్యరు. దైన్యానికి ప్రతిబింబంగా ఉన్నాడు. నన్ను చూసి ఇంట్లోకి చూస్తూ కళ్ళ నీళ్ళు తుడుచుకున్నాడు.

ఇంట్లోకి వెళ్ళాను. మంచం మీద బల్లిలా అంటుకుపోయి పడుకునుంది అయ్యరు పెద్ద కూతురు. ఏ పది రోజుల నుండో ఆహారం లేనట్టుగా వాడిపోయి ఉంది వదనం. నిద్ర పోతోంది. కళ్ళ పక్కల నుండి నీళ్ళు కారు తున్నాయి. పక్కన కూచున్న లక్ష్మి చుట్టూ ఓ చేయి వేసి, రెండో చేత్తో లక్ష్మి రెండు చేతులూ పట్టుకునుంది. నిద్రలో కూడా ఆ బంధం విడవలేదు.

నన్ను చూసి అయ్యరు భార్య వెక్కి వెక్కి ఏడ్చింది. నేను వెళ్ళిన మూడు రోజుల తర్వాత నుండీ పిల్ల జ్వరంతో, కలవరింతలతో వళ్ళు తెలీకుండా ఉందిట.

''ఎందుకొచ్చింది ఇంత జ్వరం?'' అన్నాను.

"ఏం చెప్పమంటారు బాబూ! ఆ రోజున ఆయన అన్న మాటలు, ,చేసిన పని దాన్ని హడల కొట్టేసాయి. పైగా మమ్మల్నీ ఊరులో ఉండకుండా కూడా చేయాలని చూస్తున్నారు కొంతమంది. వెర్రి తల్లి! అసలే తండ్రీ ఆ రాత్రి అన్నమాటల్తో కుమిలిపోతూంటే - అదే దొరికిందా వాళ్ళకి!" అని ఊరుకుంది దుఃఖంతో మాట రాక.

"ఏం జరిగింది?"

"వీధిలో వెళ్తూ ఈలలు, పిల్ల కనిపిస్తే చేయెత్తి పిలవడం, పనిగట్టుకు భోజనానికి వచ్చి, 'మీ పెద్దమ్మాయిని వడ్డించనమనటం -' అన్నం అమ్ముకుంటున్నా పరువు అమ్ముకోలేదు కదా బాబూ ! ఇవన్నీ చూసి ఆయన పిచ్చి కోపం.... అన్నీ కలిసి దాని మనసు విరిచేశాయి. ఓరోజు పెళ్ళున జ్వరం వచ్చి ఏక కలవరింతలు 'నాన్నా!' లక్ష్మినేం చేయక - తప్పంతా నాది, 'అమ్మా!' నేను మంచిదాన్నని వాళ్ళతో చెప్పి గొడవ చేయొద్దని చెప్పు' అంటూ, ఆఖరికి ఊళ్ళో ఉన్న పెద్ద డాక్టర్ని కూడా రానీయకుండా చేసారు. ఆయన రెండు రోజులొచ్చి మాను కున్నాడు. ఊళ్లో ఆచారి గారి మాత్రలు వాడుతున్నాం."

పక్క ఊరి నుంచి మంచి డాక్టరును పంపుతానని చెప్పి వచ్చేసాను. పంపాను కూడా. ఆయన రోజూ వచ్చి చూసేవాడు. పరిస్థితి ప్రమాదమేనని కూడా అన్నట్టున్నాడు.

నెల్లాళ్ళు గడిచిపోయాయి. ఆమె కోలుకుంటోందని విన్నాను. నా ఉద్యోగం, కాంప్‌లు, సంసారం వీటి వల్ల ఈ మధ్య అట్టే వెళ్ళడం పడలేదు.

ఆరోజు కేంప్‌కు వెళ్ళి బస్సుదిగాను.

ఎండ మండిపోతూంది. పన్నెండయింది. అయ్యరు ఎదురుగా వచ్చి నమస్కారం పెట్టాడు.

"సెలవు బాబూ ! వెళ్ళొస్తాం" అన్నాడు.

"ఏమిటి సంగతి?" అన్నట్టు చూసాను.

"ఈ ఊరు విడిచిపోతున్నాం ! ఇంకో ఊళ్ళో హోటలు పెట్టుకుంటాం."

" ఏ ఊళ్ళో!" అన్నాను. అన్నాక నా తప్పు తెలిసింది.

"ఒక ఊరనేమిటి బాబూ! ఏదో ఒకటి. మమ్మల్ని కాస్త పరువుగా బతకనిస్తే చాలు."

"అందరూ వెళ్తున్నారా?" అన్నాను.

ఓ మూలకేసి చూసాడు అయ్యరు.

అయ్యరు కుటుంబం అక్కడ కూచున్నారు. ఆ పడుచుతో లక్ష్మి నువ్వుతూ దాగుడు మూత లాడుతోంది. అయ్యర్ని చూసి ఆ పడుచు లక్ష్మిని వదిలేసింది.

ఇంతలో అయ్యరు వెళ్ళే బస్సు వచ్చి నట్టుంది.

అతను తొందర పడుతూ హడావిడిగా సామను కేసి పరిగెత్తాడు. ఆ తొందరలో పంచ కాలిలో చిక్కుకుని ముందుకు పడబోయి ఆపుకున్నాడు. అడ్డొచ్చిన కూలీ వాళ్ళని తోసేస్తున్నాడు. ఆయాస పడుతూ సామానంతా తెచ్చుకొని బస్సు మీద వేసుకున్నాడు. చెమటతో చొక్కా వంటికి అంటుకుపోయింది. భార్యనీ, పిల్లల్నీ తొందరగా ఎక్కమని తొందర చేస్తున్నాడు.

అతని ఆత్రుత చూస్తుంటే నాకు అనిపించింది- ఎంత వింత ఈ జీవితం? ప్రతి జీవితం ఓ రహస్యం. ఆ రహస్యపు గూడులో ఎన్నో ఆశలు, ఆశయాలు, మిగిలిపోయిన కలలు, అందుకోలేని బంగారు ఊహలు - అన్నిటితో జీవితం వింతగా పయనిస్తుంది.

కష్టాలకు, అడియాలకు రూపాంతరమైన అయ్యరు జీవితంలో నిత్యం సంఘర్షిస్తూ ఓడిపోతూ, మనసులోని వ్యధ ఆపుకోలేక కుటుంబాన్ని బాధిస్తూ.... ముందుకు పోతున్నాడు. దేన్నో వెతుక్కుంటూ.

ఎక్కడికో పోయి మళ్లా కొత్తగా జీవితం ప్రారంభించాలని ఆశ. అలా చేస్తే మాత్రం అతని లోని బాధ తగ్గుతుందా? అయితా అతడు పోరాడుతూనేఉన్నాడు -పోరాడి ఏం నెగ్గాలో సరిగ్గా తెలీకపోయినా ..

బస్సు బయల్దేరబోయింది.

నాకు నమస్కరించి అయ్యరు బస్సు ఎక్కాడు.

అతను నిలుచున్న చోట అతని వికృతమైన పెద్ద పాదాలు ఆ దుమ్ములో అడుగుజాడల ముద్ర వేసాయి.

జీవితంలో కనిన బంగారు కలలు మసి అయిపోగా, తాను ఊహించుకున్న పాలరాతి మందిరం చిన్నాభిన్నమై కూలిపోగా - నిత్య జీవితంలో కావలసిన వాళ్ళను రాసి రంపాన పెడుతూన్న వ్యక్తి విడిచి వెళ్లిన అడుగులవి.

అయితేనేం? వాటి విలువ ఎనలేనిది.

గమ్యం ఆకళించుకోలేకుండా, ఏదో గమ్యా నికి పోతున్నామనే ఊహతో ముందుకు పోతూన్న నిత్య ప్రయాణీకుని ముద్రలు అవి.

అతడు నిరంతర అన్వేషి. అన్వేషణ ఫలించడం కాదు ధ్యేయం, కనబడని దాన్ని అన్వేషిస్తూ బతకడమే ఈ నిరంతర యాత్రికుని తాపత్రయం.

మానవుని తాపత్రయం తాలూకు చిహ్నా లైన ఈ అడుగుజాడలు పృధివంతా ఆవరించు కొన్నాయి.